United International Journal of Multidisciplinary Research
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

# భారతీయ వేదాంత జ్ఞాన పరంపర - వేమన సాహిత్యం

**1. డా॥ పిల్లి వాసు**
అతిథి అధ్యాపకులు
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
**2. డా॥ దాసరి విజయలక్ష్మి**
తెలుగు అధ్యాపకురాలు
జె.యం.జె. మహిళా కళాశాల (అటానమస్), తెనాలి

"తెలుగునాటన తెరలు తెరలుగ కారుచీకటి కమ్మినప్పుడు మూఢచాందసగాఢదుర్గమ్మత మూలుగుల్లో చొచ్చినప్పుడు కాంతిఖడ్గమై, కరుణవైద్యమై మానవతామూర్తిగా, హేతువాదిగా జాతిజనుల సముద్ధరించగ జననమొందెను తెలుగుగడ్డను"

అని ఆరుద్రగారు ఒక ప్రముఖ కవిని గురించి పలికిన ఈ నాలుగు మాటలకు అక్షరాక్షర రూపమై మనముందు దర్శనమిచ్చే వ్యక్తిత్వం మన ప్రజాకవి వేమనది.

సాహిత్యం అంటే కేవలం అనువాదం మాత్రమే కాదు. సాహిత్యం అంటే కేవలం అనుసరణ మాత్రమేకాదు. ఏ రచయితకైనా, ఆ కవి రాసిన యే రచనకైనా, వస్తువు అనేది ప్రధానం. ఆ వస్తువు అనేది సామాజిక తాత్విక నేపధ్యం నుండి ఆవిర్భవించినదైనప్పుడే, అది సమగ్ర సాహిత్యమౌతుంది. ఆ విధమైన సంపూర్ణ సమగ్రతను తన కవిత్వంలో సాధించిన వాడు మన ప్రజాకవి వేమన.

ఎన్నెన్నో సామాజిక రుగ్మతలను తడుముతూ, చమత్కార యుక్తంగా, ఆశువుగా, ఆటవెలదుల్లో సమాజపు డొల్లతనాన్ని, అనైక్యతను చాటి చెపుతూ, చాందసత్వపు మేడిపండు విధానాన్ని పొట్టవిప్పి చూపించి, దాని మీద తుపుక్కుమన్న మానవతా మూర్తి, సమ సమాజత్వపు చైతన్యమూర్తి వేమన. జనులందరి నాల్కలపై సజీవత్వాన్ని పొందినవాడు, హేతుబద్ధమైన సహేతుక అక్షరాల విత్తుల్ని ఈ సమాజ క్షేత్రంలో చల్లి, సమ సమాజత్వమనెడి అభ్యుదయ పంటకై కాంక్షించిన సమాజ క్షేత్రపాలకుడు, ప్రజా చైతన్య వ్యవసాయదారుడు మన వేమన.

అటువంటి సామాజిక అభ్యుదయవాది, విప్లవమూర్తి యైన వేమనను, శ్రీ శ్రీ వంటివారు కవిత్రయంగా ఒకరిగా పేర్కొన్నారు. వారిలో (తిక్కన, వేమన, గురజాడ) వేమన రెండవవాడు. అయితే శ్రీ

United International Journal of Multidisciplinary Research
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

శ్రీ చెప్పిన ఈ క్రమాన్ని కూడా కాదని, నేడు హేతువాద, నాస్తిక, దళిత ఉద్యమకారుడైన కత్తి పద్మారావు లాంటివారు ఆ కవిత్రయ క్రమాన్ని తిరస్కరించి, దాని స్థానంలో నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన సందర్భం లేకపోలేదు. ఈ శతాబ్దం నాది అని సగర్వంగా చాటుకున్న యుగకవి శ్రీ శ్రీ కి కవిత్రయంలో ద్వితీయ స్థానాన్ని కల్పించిన ఆ క్రమంలో వేమనను ఆదికవిగా, శ్రీశ్రీ ని ద్వితీయునిగా, చెరబండరాజును మూడవవానిగా చెబుతూ, వేమన శ్రీ శ్రీ, చెరబండరాజు అని నూతన భాష్యం చెప్పటం కూడా చూస్తున్నాం. ఇక్కడ కత్తి పద్మారావు లాంటివారు, వేమనకు ఆదికవి స్థానాన్ని కల్పించటంలోని వుద్దేశ్యం గమనిస్తే... ఈ వ్యాసం మొదట్లో చెప్పినట్లు, సాహిత్యమంటే కేవలం అనువాదం మాత్రమే కాదు, సాహిత్యమంటే కేవలం అనుసరణ మాత్రమే కాదు, అది సామాజిక తాత్వాక నేపధ్యం నుండి ఆవిర్భవించినదై వున్నప్పుడే, ఆ సాహిత్యం ప్రజా సాహిత్యమౌతుంది, అలాంటి సాహిత్యాన్ని సృజించినవాడినే మనం ప్రజాకవి అంటాము. అలా ప్రజాకవిగా ప్రజల నాల్కలపై చిరంజీవిగా వెలుగొందిన సామాజిక తాత్వికుడైన వేమననే ఆదికవిగా పిలవటమనేది సమర్ధనీయమైన భావనగా కత్తి పద్మారావు వంటివారి దృష్టికోణంగా కనిపిస్తుంది. ఇది నాణానికి ఒక వైపున వున్న దృష్టికోణంలో బాగంగా మాత్రమే సమర్ధనీయమౌతుంది, కానీ ప్రాచీన సాహిత్య విలువలు అనే భావజాల పునాదులపైననే ఈ సమాజంలోని క్రమక్రమమైన దిద్దుబాట్లనేవి నేటి ఆధునిక సమాజంలో ఆవిష్కృతమైనాయనేది యే మాత్రం మరువకూడని వాస్తవికాంశం.

వాస్తవానికి సాహిత్యమంటే సమాజాన్ని ఉన్నచోటు నుండి ఉన్నతమైన చోటుకి నడిపించటమేనని, అదే ఆ సాహిత్యానికి పరమ ప్రయోజనార్ధమని, పూర్వకాలం నుండి నేటివరకూ వున్న అనేకానేక సాహిత్య ప్రక్రియల్ని గమనిస్తే మనకు అవగతం కాక మానదు. 'సహితస్య భావః సాహిత్యమ్' 'హితేన సహితం సాహిత్యమ్' అనే నిర్వచనాల్ని, దానిలోని లోతైన భావాల్ని గ్రహిస్తే, ఆ హితాన్ని, మేలును చేకూర్చడమే సాహిత్యం యొక్క పరమ ప్రయోజనంగా అర్ధమౌతుంది... అంటే అసంపూర్ణంగా వున్న సమాజాన్ని సంపూర్ణత వైపుకు నడిపించడం, అసమగ్రంగా వున్న సమాజాన్ని సమగ్రత వైపుకు నడిచేట్టు చేయటం, అపజయాల్లో, అనైక్యతలో, అసమానతల్లో వున్న సమాజాన్ని ఉన్నతమైన స్థితిలోనికి నడిపించటమే నిజమైన మేలును, హితాన్ని చేకూర్చటం అంటాం. అటువంటి సాహిత్యమే సహితమైనదవుతుంది. సరిగ్గా అటువంటి సాహిత్యాన్ని ఈ సమాజానికి బోధిస్తూ, భోగాన్ని వదిలి

యోగిలాగా సంచారం చేస్తూ జనక్షేత్రాలలో జ్ఞాన విత్తుల్ని, ఆటవెలదులుగా చల్లుకుంటూ తన సాహిత్యం ద్వారా ప్రజల అంతరాంతరాల్లోకి ప్రయాణించిన సమ సమాజ స్వాప్నికుడు వేమన.

తన లో నుండి బయలుదేరి సమాజపు గుండెలోతుల లోలో పలికి, ప్రయాణించిన సమ సామాజిక విప్లవకారుడు ఈ ప్రజాకవి వేమన.

క్రీ.శ. 1652-1730 ప్రాంతానికి చెందిన వేమనను ఈ ప్రపంచానికి పరిచయం చేసింది చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. 1816లో భారతదేశం వచ్చిన సి.పి. బ్రౌన్, దాదాపు 18 యేళ్ళ కాలం పాటు, ప్రజల నాల్కలపైననే సజీవ కవిత్వ రూపంగా బ్రతికున్న వేమనను ప్రజల నుండి సేకరించి, సుమారు 1834 ప్రాంతానికి వేమనను తాను పూర్తిగా కనుగొన్నట్లు సి.పి. బ్రౌన్ సాధికారికంగా ప్రకటించాడు. తాను తన సాహిత్యం ద్వారా ప్రజల గుండెల్లో స్థిరంగా వున్న వేమనను, ఆనాటి బాహ్య ప్రపంచానికి పరిచయం చేసింది కేవలం పాశ్చాత్యులే. సి.పి. బ్రౌన్ సేకరించిన కొన్ని వందల పద్యాలను, 1910 లో విలియం హోవర్డ్ కాంబెల్ (డబ్ల్యూ. హెచ్. కాంబెల్), జి. యు. పోప్, సి.ఇ. గోవర్ వంటి పాశ్చాత్య సాహిత్యవేత్తలైన వారు, ఈ వేమన పద్యాలను ఆంగ్ల భాషలోనికి అనువదించి, మన ప్రజాకవి వేమనను వారు 'లోక కవి'గా ప్రపంచానికి గొప్పగా పరిచయం చేశారు.

అప్పటి వరకూ అంటే సుమారు రెండు శతాబ్దాల కాలం వరకూ తెలుగు సాహిత్య చరిత్రకారులు, ఒక గొప్ప సాంఘిక విప్లవకారుడు, సామాజిక సంస్కర్త అయిన వేమనకు సంబంధించిన పరిచయం గానీ, కనీసం వేమన పేరునైనా తమ రచనల్లో ప్రస్తావన చెయ్యకుండా, సామూహిక మౌన హననానికి పాల్పడి, గొంతుల్ని పెకలించకుండా, ఈ బాహ్య ప్రపంచానికి తెలియనివ్వకుండా, దారుణమైన కుట్రలకు బలిచేశారనే అపవాదు కూడా సాహిత్య చరిత్ర పరిశోధకులపై లేకపోలేదు. అయితే ఆ అపవాదుల్ని తిప్పికొడుతూ ఆరుద్ర వంటి వారి చేత, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు వేమన గురించి, ఆయన తాత్వికతకు సంబంధించిన ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించి, వాటిద్వారా కందుకూరి, గురజాడ, కావలి రామస్వామి, కట్టమంచి రామలింగారెడ్డి వంటివారు వేమనను బాహ్య ప్రపంచానికి తెలియజేయటానికి విశేష కృషి చేసినట్లుగా చెప్పడంతో, ఆనాటి నుండి క్రమక్రమంగా వేమన సాహిత్యానికి పండిత లోకంలో అనన్య గౌరవం దక్కింది, అప్పటి వరకూ కేవలం వేమనను సజీవునిగా నిల్పింది మాత్రం కేవలం జానపదులేనని చాలా బలంగా చెప్పవచ్చు. కేవలం ఈ జానపదులైన వారే తమ నాల్కలపై మౌఖికంగానే ప్రచారం చేస్తూ, వేమనకు సజీవత్వాన్ని కల్పించారు. సామాన్య ప్రజలకు

అర్ధమయ్యే బాషలో, సులభమైన సరళ పదాలతో చమత్కారయుక్తమైన చురకలను వేస్తూ, ఈ విశ్వానికి వేమన చెప్పే మాటను వినమని ప్రబోధించాడు.

వేమన సకల శాస్త్రాల సారాన్ని కాచివడపోసి చెప్పిన ఈ మాటలు అత్యుత్తమ ప్రామాణికాలు. ఆ మాటల ప్రభావం-ప్రయోజనం అనన్యం- అసామాన్యం. అదే భారతీయ వేదాంత జ్ఞాన పరంపర. వేమన చెప్పిన మాటలు అసంపూర్ణంగా, అసమానంగా, అజ్ఞానంగా, అసంతృప్తిగా, అచేతనంగా వున్న భారతీయ సమాజానికి సంపూర్ణత్వాన్ని, సమానతా జ్ఞానాన్ని, సంతృప్తి, చేతనల్ని కలిగించే కరదీపికలు. వేమన చెప్పిన పద్యాల్ని విన్నా, చదివినా సకల ఆనందాలు కలుగుతాయి.

"ఒక పద్యంబును మదినిడి ప్రకటితమగు గుట్టు తెలిసి పరికించినచో సకలంబును శృత్యర్థము నికటంబగునిట రహస్యనిలయము వేమా! " అంటూ వేమన చెప్పిన ఒక పద్యాన్ని చదివినా, విన్నా దానిలోని నిగూడార్థం గ్రహిస్తే సకల వేదాలు, సకల శాస్త్రాల సారమంతా అందులోనే ఇమిడి వున్నట్లు, గ్రహించగలమని 'సర్వ జనహితైషి మన వేమన' అంటూ చాటిన భాగవతుల సుబ్రహ్మణ్యం తన పరిశోధనలో తెలియజేయటం కనిపిస్తుంది.

తెలుగు సాహిత్య లోకంలో కవిత్రయంగా పేరొందిన నన్నయ, తిక్కన, ఎర్రనలలో నన్నయ కేవలం భారతాన్ని అనువదించిన అనువాదకుడిగానే కనిపిస్తాడు, తర్వాత తిక్కనలో ఎంత ప్రతిభ తొణికిసలాడుతున్నప్పటికీ కేవలం భారత, రామాయణాలను అనువాదం చేయటానికే తన ప్రతిభను వెచ్చించినట్లుగా కనిపిస్తుంది. ఎర్రన, సోమన, నన్నెచోడుడు సంస్కృత పురాణ కావ్యాలను అనువదించిన వారిగానే కనిపిస్తారనేది వీరిపై ఆధునికులు కొందరు చేసే ఆరోపణలుగా కనిపిస్తాయి. వీరు కేవలం కొద్ది కొద్ది మార్పులతో రచనలు, అనువాదం చేశారే కాని, సమకాలీన సమాజాన్ని తమ స్వంత ప్రతిభతో చిత్రించలేదనేది వారి అభిప్రాయంగా కనిపిస్తుంది. అదేవిధంగా శ్రీనాధుడు, పోతనలు రసాత్మక కవితలు అల్లినట్లుగానే కనిపిస్తారేగానీ, సమకాలీన జీవిత చిత్రణములు చేసినవారు కాదంటారు. ప్రబంధ యుగంలోని పెద్దన, తిమ్మన, భట్టుమూర్తి, ధూర్జటి, రామకృష్ణుడు మొదలైన ప్రబంధ కవులంతా ఆవారిత సత్కవి కల్పనా విభూషావహపూర్వ వృత్తములను సానలుతీరిన జాతిరత్నములుగా తీర్చిదిద్దినవారే గానీ, సమకాలీన ప్రతిస్పందనతో సామాజిక లోతుల్ని, దాని లోతుల్లో వున్న అంతరాల పొరల్ని యెత్తి చూపిస్తూ, సంస్కరణ మార్గంవైపు నడిపించని వారిగానే కనిపిస్తారు. పింగళి సూరనవంటి సృజనాత్మకశీలి కూడా తన కళాపూర్ణోదయం ద్వారా స్వకపోల కల్పనా వహామే" అన్నట్లుగా తోస్తుంది. అది కేవలం

ఊహాత్మకమైనదే తప్ప వాస్తవం కాదు. అందుకే పై సాహిత్యవేత్తలైన నన్నయ మొదలు ప్రబంధ కవుల వరకూ వున్న కవి పండితులను ఒక దృష్టికోణంలో దిగంబర కవులు వ్యతిరేకిస్తూ ఇలా అనటం గమనిస్తాం...

నన్నయను నరేంద్రుడి బొందలోనే నిద్రపోనివ్వు... లేపకు పండితవర్యా! రికార్డులా నోరు తిప్పకు నవసృష్టిని కాలదన్నకు భావకవుల నపుంసక హావభావాలకు సవాలు! అభ్యుదయ కవీ! నల్లమందు తిని నిద్రపోయావ్ గుడ్ బై మీకందరికీ... సలామ్ వా లేకుమ్... అని అంటూనే చచ్చిన రాజుల పుచ్చిన గాధలు మెచ్చే చచ్చు చరిత్రకారులను ముక్కు చెవులను కోసి అడగాలనుంది మానవ పరిణామ శాస్త్రం నేర్పిందేమిటని? సమస్యలకు లోతులు తీసి సామాన్యులను గోతుల్లో తోసి కాలాన్ని గాలంలా వాడుకుంటూ నిర్లిప్తతలోనే నిప్పును రాజేస్తూ అనంత అమాయక మానవ జాతిని అనాదిగా అధ్వాన్నముగా పరిపాలించే పిడికెడు మేధావులకు పిరమిడ్లు కట్టాలనుంది అని అంటారు దిగంబర కవులు.

కానీ ప్రజాకవిగా, లోకకవిగా ప్రజల గుండెల్లో సజీవత్వాన్ని పొందిన వేమనలాంటి వ్యక్తి సమకాలీన సమాజాన్ని అధ్యయనం చేసి నిండైన తెలుగు నాడులతో కవితను ఆవిష్కరించిన మహాకవి వేమన. అంతకు ముందు ఎవరిలోనూ లేని ప్రతిభ, చమత్కారం ఆయన సొత్తు. ఆయన కార్య, కారణ, విచక్షణలతో కూడిన విషయాన్ని తర్కిస్తాడు, విమర్శిస్తాడు, విశ్లేషిస్తాడు. ఆ సారాన్నంతటినీ చమత్కారంగా ప్రజల ముందు ఆవిష్కరిస్తాడు.

ఈ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ కట్టమంచి రామలింగారెడ్డి వంటివారు 'వేమన అంటే హేతుబద్ధమైన, కారణ విమర్శనా శక్తికి పట్టాభిషేకం చేసిన మహాత్ముడు' అంటారు. ఆ హేతుబద్ధతే అసలైన మూల భారతీయత. ఆ భారతీయతే అసలుసిసలైన వేదాంత జ్ఞాన పరంపర. కాబట్టి మనం గ్రహించాల్సింది వేమన పద్యాలలోని లోకజ్ఞత. ఆ లోకజ్ఞతే సమ సమాజత్వపు దృష్టికోణమై సమకాలీన సమాజానికి చక్కని సంస్కరణ మార్గాన్ని చూపిస్తూ సాగిన కవితా ప్రచార యాత్ర. నిరంతరం సామాన్య ప్రజల నాల్కలపై కొనసాగిన ఆ యాత్ర పేరే వేమన. ఆ యాత్ర సరిగ్గా ప్రజల గుండె లోతుల్లోకి ప్రయాణించింది. వేమన కవితా రూపమై, తన 'లో...' నుండి బయలుదేరి ప్రజలందరి గుండె 'లో లో...' తుల్లోకి ప్రయాణించాడు.

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

వేమన సాహిత్య వ్యక్తిత్వాన్ని దర్శించాలంటే మనలో గుండె ధైర్యం కావాలి. ఆత్మవంచన లేని, యే పటాటోపపు భేషజాలకు తలొంచని, నిప్పులా కణకణ మండే జ్ఞాన తాత్త్విక, తార్కిక శక్తి కావాలి, అలాంటప్పుడే మనకు వేమనలో మూఢనమ్మకాలను నిరశించే హేతువాద లక్షణం సరైందిగా కనిపిస్తుంది. అప్పుడే వేమనలోని సమసమాజపు మానవతావాదం

'భూమిలోన బుట్టు భూసారమెల్లను తనువులోన బుట్టు తత్వమెల్ల శ్రమములోన పుట్టు సర్వముతానవును విశ్వదాభిరామ వినురవేమ.' అంటూ చెప్పే లౌకిక మానవతావాదం కనిపిస్తుంది. శ్రమైక జీవన సౌందర్యం ఆర్థిక సమానత్వాన్ని కాంక్షించే అభ్యుదయం కనిపిస్తుంది. అప్పుడే మనకు వేమనలో సర్వ మానవ సమానత్వాన్ని కాంక్షిస్తూ అస్పృశ్యత, అంటరానితనాల నిరసనలను వెలిబుచ్చిన మహోన్నత మూర్తిమత్వం దర్శనమిస్తుంది.

'మాలవాని నేల మరి మరి నిందింప ఒడలనున్న మాంసమొకటిగాదె మాలవానినంటిమరిమరి మునిగేరు విశ్వదాభిరామ వినురవేమ.' అంటూ, సర్వ మానవ సమానతయై కనిపిస్తాడు. అదే క్రమంలో స్వామి వివేకానంద,1893లో భారతీయుల మూల తాత్త్విక జ్ఞానాన్ని చికాగో నగరంలో మానవతా-మత సామరస్య భావాలను చాటుతూ, సహజీవనమనేది భారతీయుల సంప్రదాయమని, సమైక్య భావన అనేదేదైనా అది గౌరవించదగినదని, భేదభావం చూపటమనేది నీచమైనదని, పరులను ప్రేమించటం ఉత్తమమని, ద్వేషించటంమనేదినీచమైనదని, భిన్న మతాల సమ్మేళనమైన భారతదేశాన, వివిధ మతాలమధ్య శాంతిని ప్రోత్సహించాలని ఉద్బోధించిన విధానాన్ని ఓ కవి ఇలా కవిత్వీకరించాడు.

కులాల రంగులు పులిమి / మతాల దుస్తులు తొడిగి / మనిషిని మరుగు పరచవద్దు /మానవత్వాన్ని కించపచవద్దు / మనిషిని మనిషిని ముడివేసేదే మతం / మనిషిని మనిషిని విడదీసేదే స్వార్థం /మనసును మనసును కలిపేదే మానవ భాష / మనసును మనసును విడదీసేదే దానవ ఘోష /మనకు కావలసింది మానవతా మందహాసం / మాసిపేవలసింది దానవతా వికట్టహాసం ఒక దేవుణ్ణిచంపి మరొక దేవుణ్ణి బ్రతికించలేం / ఒక మతాన్ని ఓడించి మరో మతాన్ని గెలిపించలేం / / ఉన్న దేవుడు ఒక్కడే అన్ని మతాలు ఒక్కటే

మందిరమైనా మసీదైనా / చర్చి అయినా గురుద్వార్ అయినా / /అక్కడ మనిషి సమర్పించే భక్తి ఒక్కటే సాధించే శక్తి ఒక్కటే / భక్తి భక్తి కలస్తేనే భగవంతుని శక్తి / మానవత్వం గెలిస్తేనే మనిషి బాధా విముక్తి

United International Journal of Multidisciplinary Research
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

కులం గోడలు కూలిపోతేనే / చైతన్యం జాతి రక్తం అవుతుంది / మత కలహాలు మానుకుంటేనే సౌభాగ్యం దేశ రక్షణం అవుతుంది / పుట్టిన వారందరి తీరు ఒక్కటే / గిట్టిన వారందరి దారి ఒక్కటే మధ్యలో మనకు మనం పులుముకున్న మలినం కాకూడదు కులం మనకు మనం చేసుకున్న మోసం కాకూడదీ మతం కులాతీత మతాతీత కుటుంబంగా కూడి బతుకుదాం ప్రేమను మించిన ధర్మం లేదు / సేవను మించిన దీక్ష లేదు సమతను మించిన సత్యం లేదు / సామరస్యాన్ని మించిన సౌందర్యం లేదు.

" ఒకే కులం ఒకే మతం / ఒకే జాతి మనమందరం / మన మార్గం మన గమ్యం / ఒకే జాతి మనమందరం" - ( డా పిల్లి. వాసు డిగ్రీలో రాసిన కాలేజ్ మ్యాగజైన్ కవిత ) అంటూ నినదించిన అనేక మంది మానవతా మానవ సమానతలను కాంక్షించే అనేక మంది కవిత్వ సారధులకు ప్రేరణాశక్తి ప్రజాకవి వేమన. నాటి వేమన్న మొదలు నాటి స్వామీ వివేకానంద వరకూ భిన్నత్వంలో ఏకత్వం యొక్క గొప్పతనం గోచరిస్తుంది. అటువంటి ఉత్తమోత్తమమైన భారతీయ వేదాంత, హేతుత్వ జ్ఞాన సంపన్నునిగా మనకు వేమన దర్శనమిస్తాడు.

అటువంటి వేమన నిజానికి దిగంబరుడు కాదు. వేమన ఈ సమాజాన్ని, దాని దిగంబరత్వాన్ని యెత్తి చూపించిన సామాజిక చైతన్యమూర్తి, మహా స్వాప్నికుడు.

నేటికైనా మన ఆధునిక సమాజం వేమనను, గడుల సుడుల మధ్యనుండి కాక, విశాల నేత్రాలతో ఆకాశమంత విశాల దృక్పధంతో చూడగలిగితే వేమన సాహిత్యంలోని సమ సమాజత్వపు దృష్టికోణమైన ఆది భారతీయుల మూల సిద్ధాంత జ్ఞాన దృక్పథం స్పష్టమే. ఆ స్పష్టత మనందరిలోనూ మరింతగా వెలుగొందాలని కాంక్షిస్తూ...

**ఆధార గ్రంథాలు:-**

1. ప్రజాకవి వేమన
2. వేమన పద్యరత్నాకరము
3. దిగంబర కవులు మూడు కవితా సంకలనాల సంపుటి
4. సాంఘిక విప్లవ రచయితలు, ఎన్. గోపి, భాగవతుల సుబ్రహ్మణ్యం, సాహితీ మిత్రులు, కత్తి పద్మారావు